క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవాని తిప్ప విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం లోసరి ఇండస్ట్రియల్ లైన్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కృష్ణాలయానికి రూ.50 వేల విరాళం

ఉండి: స్థానిక కొత్తపేటలోని కృష్ణాలయానికి ఉండికి చెందిన దాత నల్లా గంగాధరరావు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రతినిధులకు నగదును అందజేశారు. నల్లా విజయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను కూడా తాము నిర్వహిస్తున్నట్లు ముఖ్యంగా విద్యావ్యాప్తికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, ముదునూరి బలరామకృష్ణంరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి చినఅమిరానికి చెందిన కోనూరి రజత్‌రాజు, జయలక్ష్మి ప్రత్యూష దంపతులు రూ.లక్ష, వేగేశ్న ప్రవీణ్ వర్మ, ప్రజ్ఞ దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దాతలకు అర్చకుడు కొప్పేశ్వరరావు వేద ఆశీర్వచనాలు, అమ్మవారి శేష వస్త్రం అందించారు.

దాతల సహకారం అభినందనీయం

ఉండి: అభివృద్ధి పనులకు దాతల సహకారం అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం ఉండిలోని కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్క్ పునః ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్‌లో ప్రజలకు ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను చూసి దాతలను అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత బిజీ లైఫ్‌లో ప్రజలు సేదదీరడమే మర్చిపోయారన్నారు. ఇటువంటి సమయంలో ఉండి నడిబొడ్డున వున్న పార్క్‌ను దాతల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దడం చాలా మంచి విషయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మభూమి పార్క్ పాడుబడడం చూసిన తాను అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించాలని సూచించానన్నారు.అయితే దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారాన్ని ఇంత ఘనంగా అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు,కరిమెరక నాగరాజు,జుత్తిగ శ్రీనివాస్,పారిశ్రామికవేత్తలు ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: పట్టణంలో న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వులిశెట్టి సంతోష్, ఎం.అవినాష్, గౌరవ అధ్యక్షుడిగా డి.పశుపతి, ఉపాధ్యక్షుడిగా పి.ఆదిత్య, సంయుక్త కార్యదర్శిగా పీవీ సందీప్, క్రీడల కార్యదర్శిగా బి.గోపిచంద్, కోశాధికారిగా జి.భార్గవి ఎన్నికయ్యారు.

దేశ ప్రగతిలో విద్యార్థులు భాగం కావాలి

భీమవరం అర్బన్: విద్యార్థులు దేశ ప్రగతి కోసం ఆలోచనలు చేయాలని అప్పుడే ప్రగతి సాధించగలమని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు పేర్కొన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్, కమ్యూనిటీ సర్వీసెస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండిపెండెంట్ ఇండియాపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకునే విధంగా ప్యానల్ డిస్కషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలత, డాక్టర్ కె కిషోర్‌రాజు, డాక్టర్ శ్యామలరావు, డాక్టర్ బీవీడీ శేఖర్, డాక్టర్ సుబ్బారావు, రామ్ గోపాలరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వి అనురాధ, కేవీఎస్ ఉమాదేవి, బి. రాము తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఆర్థిక సాయం

భీమవరం: హమాలీ కార్మికులు ప్రజలకు నిత్యవసర సరుకులు అందించడంలో కీలకంగా పని చేస్తున్నారని వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మృతిచెందిన భీమవరం బజారు లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘ సభ్యులు నాగేశ్వరరావు, పి.రాము కుటుంబ సభ్యులకు గురువారం రూ.40 వేలు ఆర్థిక సహకారం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.శ్రీను,టి రాంబాబు, పి.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

భీమవరం పరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు మంత్రి,కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనికులను సత్కరించారు. అనంతరం చిన్నారులు దేశ భక్తి గేయాలను ఆలపించారు.

– భీమవరం







స్వాతంత్ర్య వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు



స్వాతంత్ర్య వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన



స్వాతంత్ర్య వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు

మువ్వన్నెల జెండా రెపరెపలు

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

భీమవరం: పట్టణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీ కార్యాలయాల వద్ద స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి బాలలకు మిఠాయిలను పంపిణీ చేశారు. భీమవరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జిల్లా బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు జెండా ఆవిష్కరణ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్ద, మార్నింగ్ కాఫీ క్లబ్ వద్ద, డీఎన్నార్ కళాశాలలో, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో, మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో, సుంకర పద్దయ్య వీధిలో, పలు చోట్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని, ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మారిసేడి బాబ్జి, జంపన సుబ్రహ్మణ్యంరాజు, శోడదాసి గంగయ్య, ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామ్మోహనరావు, డీఎన్నార్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం

వీరవాసరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. స్వాతంత్ర సమరయోధులను గుర్తుకు చేసుకుంటూ ఘన నివాళులర్పించారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఇంచార్జ్ ఎంపీడీవో విజయసారథి, ఎస్సై పి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమ పోరాట యోధులు ఆదర్శనీయం

భీమవరం అర్బన్: ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితమే మనకు స్వేచ్ఛా వాయువులని వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమకారులైన మహాత్మాగాంధీ, గోపాలకృష్ణ గోఖలే, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్‌చంద్రబోష్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర ఎంతోమంది ప్రాణాలను పణంగా పెట్టి దేశం కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, తిరుమాని ధనంజయరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

యనమదుర్రులో

యనమదుర్రులో మెల్లా సరోజని కృష్ణమూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెల్లా రాంబాబు, బాలాజీ, చెన్ను నాగబాబు, గెద్దాడ రాంపండు, బి.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో...

గూట్లపాడు, గొల్లవానితిప్ప, రాయలం, దిరుసుమర్రు, పెదగరువు, వెంప, అనాకోడేరు, బేతపూడి, కొత్తపూసలమర్రు, తదితర గ్రామాల స్కూల్స్‌లో 78వ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

జాతీయ సమైక్యత సమగ్రతను కాపాడుకుందాం

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ సమైక్యత సమగ్రతను కాపాడటం మనందరి బాధ్యతని పలువురు వక్తలు అన్నారు. క్విట్ ఇండియా స్తూపం వద్ద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర వీరులకు నివాళులు అర్పించి అనంతరం ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన త్యాగధనుల ఆశయాలు అమలు చేయాలని, ఈనెల 17న క్విట్ ఇండియా స్థూపం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే హౌసింగ్‌బోర్డు కాలనీలో, మున్సిపాలిటీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, నరహరిశెట్టి కృష్ణ, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కంతేటి వెంకట్రాజు సరిపిడకల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరు వాడ స్వాతంత్ర్యోత్సవ వేడుకలు

ఉండి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడవాడలా మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంధ సంస్థలు, చర్చిల వద్ద 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆయా ప్రతినిధులు ఆవిష్కరించారు. యండగండిలో గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జాతీయపతాక ఆవిష్కరణ నిర్వహించారు.ట్రినిటీ లూథరన్ చర్చ్ వద్ద, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, మహదేవపట్నంలో, చిలుకూరు, తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

ఆకివీడు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాను ఉత్సాహంగా ఎగురవేశారు. స్థానిక జెడ్పీ స్కూల్, ఎమ్మార్వో కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు జెండా ఆవిష్కరించారు. జెడ్పీ స్కూల్, సీఎం హైస్కూల్, ఆదిత్య హైస్కూళ్ళ ఆధ్వర్యంలో 300 మీటర్ల జెండా ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక నగర పంచాయతీ వద్ద చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల పరిషత్ వద్ద ఎంపీపీ కఠారి జయలక్ష్మి, అబ్బాయిరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ జీవీ కృష్ణ మోహన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీకర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షడ్రక్, నాతిరెడ్డి అన్నవరం, కొట్టు మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నింగికెగసిన జాతీయ జెండా

పాలకోడేరు: స్వాతంత్ర పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని వారి ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పలువురు వక్తలు ఉద్బోధించారు. 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కలెక్టర్ చదలవాడ నాగరాణి పాలకోడేరు హైస్కూల్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, మొక్కలను నాటారు. అనంతరం దాతల సహకారంతో ఆధునికరిస్తున్న హైస్కూల్ భవనాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పాలకోడేరులో వివిధ ఆఫీసుల వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. శృంగవృక్షంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు, డాక్టర్ బీ . ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, కునాధరాజు మురళీకృష్ణంరాజు, ఎంపీడీవో మురళి గంగాధర్ రావు, తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరం: డీఎన్నార్ కళాశాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు



ఉండి: యండగండిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ చినకృష్ణమూర్తి తదితరులు



వీరవాసరం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అంబరాన్నంటిన సంబరాలు

కాళ్ల: భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ముఖ్యంగా కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కాళ్ల, కాళ్ళకూరు కలవపూడి, కోపల్లె సొసైటీలో సొసైటీలలో సొసైటీ అధికారులు జాతీయ జెండా ఆవిష్కరించి స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాళ్ళ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సునీల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. వీటితో పాటు మండల కేంద్రం కాళ్ల గ్రామంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



కాళ్ల: జెండా వందనం చేస్తున్న ఎంపీపీ శిరీష

కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఏవో ప్రభాకర్రావు, జడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పెన్మెత్స విశ్వనాథరాజు, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకివీడు: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఎగురవేసిన చైర్‌పర్సన్ జామి హైమావతి



పాలకోడేరు: దేశనాయకుల వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారులు



భీమవరం: మండల పరిషత్ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం(ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కొత్త భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం



ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: మండల వ్యవస్థ నాటి నుంచి చిన్న భవనంలో కొనసాగుతున్న పాలకోడేరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంలోకి తరలించారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా గల భవనంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా వచ్చిన తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి ఉన్నతాధికారులతో చర్చించి నూతనంగా నిర్మించిన సచివాలయం భవనంలోకి మార్చారు. కలెక్టర్ సి.నాగరాణి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

భీమవరం: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయజెండాను ఎగురవేసి మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనకు ప్రాణాలర్పించిన మహనీయులను నిత్యం స్మరించుకోవాలన్నారు. కొత్తగా అధికారం చేట్టిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనల మాదిరిగానే మన రాష్ట్రంలోనూ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్దపు హామీలతో గద్దెనెక్కిన నాయకులకు గుణపాఠం చెప్పడానికి మరో పోరాటం తప్పదని శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీకి పోరాటం కొత్త కాదని 2014లో అధికారంలో ఉన్న టీడీపీ చేసిన అరాచకాలు, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేసి 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మాజీ ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎస్‌రాజు, కామన నాగేశ్వరరావు, వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, కోడే యుగంధర్, ఎండీ కరీముల్లాబాషా, బలే ఏసుబాబు, నల్లం రాంబాబు, షేక్ రబ్బాని, గంటా సుందరకుమార్, అల్లూరి నాగవల్లి, కందికట్ల ఎడ్వర్డ్, పాలపర్తి జోన, చెల్లబోయిన సూర్యప్రకాష్, నల్లం రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జాతీయజెండా ఎగురువేస్తున్న శ్రీనివాస్